సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



పత్తి రైతు దిగాలు!

అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలు వర్షార్పణం అవుతున్నాయి. వివరాలు 8లో ▸



టేకు మొక్క నాటేదెప్పుడు?

రైతులు గట్లపై నాటుకునేందుకు టేకు మొక్కలనూ ఉచితంగా ఇచ్చే ప్రభుత్వం ప్రస్తుతం నిలిపివేసింది. వివరాలు 8లో ▸



పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం?

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం అమల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వివరాలు 9లో ▸

సింగూరు రికార్డు బ్రేక్

- 200 టీఎంసీలు దాటిన వరద జలాల రాక
- 1998–99లో వచ్చిన వరద 176 టీఎంసీలు
- 27 ఏళ్ల తర్వాత ఇంత భారీ స్థాయిలో వరద
- మంజీరా నది పాలైన జలాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సింగూరు ప్రాజెక్టు వరద జలాల రికార్డులు బ్రేక్ అయింది. ఈ వర్షాకాలం సీజనులో ఇప్పటి వరకు ఏకంగా 200 టీఎంసీల వరద జలాలు ఈ ప్రాజెక్టులోకి వచ్చాయి. దీంతో వరద నీటిని ప్రాజెక్టు గేట్లు ఎత్తి మంజీరా నదిలోకి వదలేశారు. ప్రాజెక్టు చరిత్రలో ఇంత రికార్డు స్థాయిలో వరద జలాలు నదిలోకి వదలడం ఈ ఏడాదే మొదటిసారని నీటి పారుదలశాఖ అధికారులు పేర్కొంటున్నారు. 1989లో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. 1998–99లో ఈ ప్రాజెక్టుకు 176 టీఎంసీల వరద వచ్చినట్లు నీటి పారుదల రికార్డులు చెబుతున్నాయి. 2010 -11 సంవత్సరంలో కూడా భారీగానే వరద వచ్చింది. ఆ సంవత్సరం 106 టీఎంసీల వరద వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2016–17లోనూ 105 టీఎంసీలు, 2021–22లో 101 టీఎంసీలు వచ్చింది. సుమారు 27 ఏళ్ల తర్వాత ఈసారి ఏకంగా 200 టీఎంసీలు దాటడం గమనార్హం. సాధారణంగా ఒక టీఎంసీ నీటితో 10 వేల ఎకరాలకు సాగునీటిని అందించవచ్చు. ఈ లెక్కన 200 టీఎంసీలతో సుమారు 20 లక్షల ఎకరాల ఆయకట్టును సాగులోకి తేవచ్చు. దీన్ని బట్టి చూస్తే ఏ స్థాయిలో వరద జలాలు మంజీరా నది పాలయ్యాయనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తిన దృశ్యం

జిల్లాతో కర్నాటక, మహారాష్ట్రల్లో క్యాచ్‌మెంట్‌లో..

జిల్లాలో ఉన్న ఏకైక బహుళార్థక సాధక ప్రాజెక్టుకు జిల్లాతో పాటుగా, కర్నాటక, మహారాష్ట్రల పరిధిలో క్యాచ్‌మెంట్ ఏరియా ఉంది. ఈ ఏరియాల్లో ఈసారి భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ఈ కారణంగా ఈ ప్రాజెక్టుకు వరద జలాల రాక ఉధృతంగా సాగుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద జలాలను మంజీరా నదిలోకి వదులుతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్టుకు ఆనకట్ట దెబ్బతిన్న నేపథ్యంలో డ్యాం సేఫ్టీ అథారిటీ నీటి నిల్వలను 16 టీఎంసీలకే పరిమితం చేయాలని సూచించింది. దీంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 29.9 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 16 టీఎంసీలకే పరిమితం చేస్తున్న విషయం విదితమే.

క్రాప్ హాలీడే ప్రకటించిన సంవత్సరంలో..

సింగూరు ప్రాజెక్టు ఆయకట్టుకు ఈ ఏడాది ప్రభుత్వం క్రాప్ హాలీడే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇలా క్రాప్‌హాలీడే ప్రకటించిన సంవత్సరంలోనే ఇంత భారీ స్థాయిలో వరద రావడం గమనార్హం. మరోవైపు భారీ ఎత్తున వరద జలాలు రావడంతో విద్యుత్ ఉత్పత్తి కోసం జెన్‌కోకు కూడా నీటి విడుదల కొనసాగుతోంది. నిర్దేశిత లక్ష్యం మేరకు ఈసారి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్‌కో అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఈ జలాశయం ఆధారంగా ఉన్న ఘనపురం ఆనకట్టకు, కామారెడ్డి జిల్లాలో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టుకు కూడా నీటి విడుదల చేశారు. హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌తో పాటు, మిషన్‌భగీరథ తాగునీటి అవసరాల కోసం కూడా ఈ నీటిని వినియోగిస్తున్న విషయం విదితమే.

ఓడి.. గెలిచేందుకు నో చాన్స్!

- ఒకేసారి పరిషత్, పంచాయతీ ఎన్నికలు
- ఒక్క నోటిఫికేషన్‌తోనే ఎన్నికల నిర్వహణ
- అభ్యర్థుల ఎంపికపై పార్టీల దృష్టి

సంగారెడ్డి జోన్: స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి నిర్వహించే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికలలో పోటీ చేసే ఆశావాహులకు తీవ్ర నిరాశే మిగిల్చినట్లయింది. నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాలలో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొంది. ఎన్నికలలో పోటీ చేసి గెలిచేందుకు అభ్యర్థులు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

రెండు ఎన్నికలకు ఒకే నోటిఫికేషన్

స్థానిక సంస్థలు (జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ, వార్డు) ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకే నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో ఒక నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలు నిర్వహించి, కొంత సమయం తీసుకుని మరొక నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నిక నిర్వహించేవారు. ప్రస్తుతం గతంలో కంటే భిన్నంగా ఒకేసారి నిర్వహించేందుకు నిర్ణయించారు. గతంలో ఒక ఎన్నికలో పోటీ చేసిన అభ్యర్థి స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓటమి పాలైతే.. మరో ఎన్నిక బరిలో నిలిచేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుత ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ముందుగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఆ వెంటనే గ్రామపంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు. దీంతో ఈ సారి ఓడి గెలిచేందుకు అవకాశం లేకుండా పోయింది.



హత్నూర మండల ప్రజాపరిషత్ కార్యాలయం

రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు

జిల్లాలో 25 మండలాలు, ఉండగా 613 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 25 జెడ్పీటీసీ, 261 ఎంపీటీసీ, 613 గ్రామ పంచాయతీలు, 5,370 వార్డుల స్థానాలకు పోరు జరగనుంది. అయితే ఈ ఎన్నికలు రెండు విడతలలో నిర్వహించనున్నారు. మొదటి విడతలో జహీరాబాద్, నారాయణఖేడ్, రెండో విడతలో సంగారెడ్డి, అందోల్–జోగిపేట డివిజన్ల పరిధిలోని మండలాలలో పరిషత్‌తో పాటు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

కీలకంగా అభ్యర్థుల ఎంపిక

పరిషత్‌తో పాటు పంచాయతీ ఎన్నికల బరిలో పోటీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కీలకంగా మారింది. అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు తమ గెలుపు సాధించేందుకు సరైన వారిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. అధిక సీట్లు సాధించేందుకు మండలాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండు ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక ఆయా పార్టీల నేతలకు తలనొప్పిగా మారింది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వరద

మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి మళ్లీ వరద ప్రారంభమైంది. సోమవారం 22,000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. మూడు గేట్లను మీటరున్నర ఎత్తు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 17.500 టీఎంసీల నీటిని ఉంచి మిగతా నీటిని దిగువకు వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రంలో రెండు టర్బయిన్ల ద్వారా 2,550 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

నిధులు మంజూరు చేయండి

సీఎంను సన్మానించిన ఎమ్మెల్యే



ముఖ్యమంత్రి రేవంత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట ఇబ్రహీంపట్నం, నకిరేకల్, భువనగిరి ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వేముల వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా వైద్యాధికారి నాగ నిర్మల



మందులను పరిశీలిస్తున్న నాగ నిర్మల

హత్నూర(సంగారెడ్డి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి నాగ నిర్మల అన్నారు. సోమవారం హత్నూర మండలం చింతలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే ఇతర ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వైద్య సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అంతకుముందు ఆమె ఆస్పత్రిలో పలు రికార్డులు, మందులను పరిశీలించారు.

పంట పరిహారం అందించాలి

బీకేఎస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పరిహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను తొందరగా ప్రారంభించాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవలో భక్తులు

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం ఏడుపాయల వన దుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించారు. మొదట రాజగోపురంలోని ఉత్సవ విగ్రహానికి అర్చకులు పూజలు చేసిన అనంతరం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో పాదయాత్ర



వట్‌పల్లి సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. వేదికపై మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి, ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, మాణిక్‌రావు తదితరులు

- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులపై సర్కార్ నిర్లక్ష్యం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- కలిసికట్టుగా పనిచేస్తే జెడ్పీ పీఠం మనదే
- వట్‌పల్లిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 'అలయ్–బలయ్' కార్యక్రమం

వట్‌పల్లి(అందోల్): కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందంటూ తప్పుడు ప్రచారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తెస్తాడని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. మల్లన్నసాగర్ ఏమైనా నీ అయ్య కట్టిండా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వట్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ – బలయ్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో 1.20 లక్షల ఎకరాల సాగునీరు అందించేందుకు సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు సీఎం హోదాలో కేసీఆర్ శంకుస్థాపన చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆ పనులను నిలిపివేసిందని విమర్శించారు. ఈ పథకాల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సంగారెడ్డి జిల్లాలో పాదయాత్రను చేపట్టనున్నట్లు హరీశ్ ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటేనే ప్రజలకు శ్రీరామ రక్ష అన్నారు. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటేనే ఢిల్లీ మెడలు వంచవచ్చునని, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీకి ఏ ప్యాకేజీ అడిగినా క్షణాల్లో నరేంద్రమోదీ మంజూరు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఉన్నా.. తెలంగాణాకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని, కలసికట్టుగా పనిచేస్తే సంగారెడ్డి జెడ్పీ పీఠం బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు.

యూరియాపై నోరు మెదపరేం..?

యూరియా కొరతపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎవరైనా పార్లమెంట్‌లో మాట్లాడారా అని హరీశ్ నిలదీశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గోధుమలు రూ.2,585, వడ్లకు రూ.2,369ల మద్దతు ధరను చెల్లించడంలో బీజేపీ మోసం చేసిందని విమర్శించారు. కమీషన్‌లు వచ్చే పనులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఢిల్లీకి మూటలు మోసేందుకే రేవంత్ రెడ్డికి సమయం సరిపోవడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ జెడ్పీ చైర్మన్‌లు మంజుశ్రీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

సంగారెడ్డి: ఎన్నికల విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి అభ్యర్థుల తుది జాబితా ప్రకటన వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌ఓ, ఏఆర్‌ఓల సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జెడ్పీ సీఈఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఏర్పాట్లు పూర్తి: ఎస్పీ

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు రూట్ల వారీగా సిబ్బందిని నియమించి ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుతో పాటు బ్యాలెట్ బాక్సులు పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాల వరకు తరలింపు వరకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి, డీపీఓ సాయిబాబ పాల్గొన్నారు.



పట్టణంలోని ఏఎస్ నగర్ రోడ్డులో ప్రవహిస్తున్న వరద, వర్షపు నీరు

ఖేడ్‌లో కుమ్మేసిన వాన

- కాలనీలు జలమయం.. స్తంభించిన రాకపోకలు
- కంగ్టిలో అత్యధికంగా 12.56 సెం.మీ వర్షపాతం నమోదు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో సోమవారం తెల్లవారు జాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కుండపోతగా కురియడంతో రహదారులు, కాలనీలు జలమయమయ్యాయి. ఉదయం 9గంటల వరకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. భారీ వర్షానికి తోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు రావడంతో జనాలు ఇళ్లల్లోంచి రాలేకపోయారు. పట్టణ శివారులోని మన్సూర్‌పూర్ వాగు గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వరద నీటితో ఉధృతంగా ప్రవహించింది. ఫలితంగా ఖేడ్ నుంచి కంగ్టి, సిర్గాపూర్, పిట్లంల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాంజీపూర్ వంతెనపై నుంచి, హన్మంత్‌రావుపేట్–మాద్వార్ వంతెనలపై నుంచి భారీ వరదనీరు ప్రవహించడంతో ఈ దారిలోనూ రాకపోకలు నిలిచిపోయాయి. వరదలు, చెరువుల్లోంచి నీరు పొంగిపొర్లడంతో వెంకటాపూర్, సంజీవన్‌రావుపేట్, గంగాపూర్ తదితర గ్రామాల్లోని పంటపొలాల్లోకి వరద నీరు చేరడంతో వరి పట మొత్తం నీటిపాలైంది.

కాలనీలు జలమయం

ఖేడ్ పట్టణంలోని చాలా కాలనీలు జలమయం అయ్యాయి. ఏఎస్‌నగర్, సిరూర్‌కాలనీ, దత్తాత్రేయ కాలనీతోపాటు పలు కాలనీల్లో వరదనీరు రెండుఫీట్ల ఎత్తువరకు ప్రవహించింది. రైతుబజార్‌తోపాటు జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోకి వరదనీరు చేరుకుంది. కాలనీల్లోని రహదారులు జలమయం కావడంతో మున్సిపల్ అధికారులు హుటాహుటిన నీటి మళ్లింపు పనులు చేపట్టారు. ఖేడ్ మండలంలో 75.4 మి.మీ, కంగ్టిలో 125.6, నిజాంపేటలో 110.4, సిర్గాపూర్‌లో 104, నాగలిద్దలో 92.8, కల్హేర్‌లో 73.8, మనూరులో 52.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.





కంజీవపూర్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు, రైతుబజార్‌లోకి వరదనీరు

కొనేదెలా.. తినేదెలా..?

- వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- పెరిగిన కూరగాయల ధరలు
- లబోదిబోమంటున్న వినియోగదారులు

జహీరాబాద్ టౌన్: కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఏదీ కొనలాన్న రూ.100 తక్కువ పలకడంలేదు. కిలో కొనే వారు పావు కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. రూ. 500తో మార్కెట్‌కు వెళితే సంచి నిండడంలేదు. నిరుపేదలు కూరగాయలు కొనలేక పప్పుచారుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జహీరాబాద్ ప్రాంతంలో ప్రతి సంవత్సరం సుమారు ఐదువేల ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తుండగా.. కర్నాటక, మహారాష్ట్రాల నుంచి మార్కెట్‌కు ప్రతి రోజు కూరగాయలు వస్తుంటాయి. వర్షాల ప్రభావం కూరగాయల సాగుపై పడింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి తగ్గడం, భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో పంట దిగుబడి పడిపోవడం వల్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు టమాట, బెండకాయ, చిక్కుడు, గోరు చిక్కుడుతో పాటు ఆకు కూరలు సాగు చేస్తుండగా కర్నాటక, మహారాష్ట్రాల నుంచి క్యాబేజీ, కాలిఫ్లవర్, ఉల్లిగడ్డ, వెల్లుల్లి, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ, టమాట పట్టణ మార్కెట్‌కు వస్తుంటాయి. పంట చేతికొస్తున్న తరుణంలో భారీ వర్షాలు కురవడంతో దిగుబడి తగ్గింది. దీంతో రైతులు నష్టపోగా.. వినియోగదారులకు అధిక భారమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్యారెట్, వంకాయ, చిక్కుడుకాయ, బీన్నీస్ తదితర కూరగాయలు రూ.120 వరకు పలుకుతున్నాయి. బీరకాయ, క్యాప్సికం, క్యాబేజీ, బెండకాయ, కాలిఫ్లవర్ కిలో రూ.80 పలుకుతుంది. టమాట కిలో రూ.30, ఆలు కిలో రూ. 40,ఆకు కూరలు కట్టా 20 రూపాయలకు తక్కువకు లభించడం లేదు. సోరకాయ ఒక్కటి రూ.50 పలుకుతుంది. వెల్లుల్లి కిలో రూ.120 పలుకుతుండగా అల్లం ధర కాస్త తగ్గింది. అల్లం మార్కెట్‌లో కిలో రూ.40 వరకు పలుకుతోంది.



జహీరాబాద్ సంతలో విక్రయిస్తున్న కూరగాయలు

పడిపోయిన దిగుబడి

భారీ వర్షాల వల్ల కూరగాయల పంట దిగుబడి పడిపోయింది. ఎకరం పొలంలో బెండకాయ సాగు చేయగా వారానికి 30 కిలోల వరకు పంట వస్తుంది. కానీ ఎకరాకు సుమారు 100 కిలోల దిగుబడి రావాలి. అప్పుడే రైతుకు, ప్రజలకు లాభం ఉంటుంది. బెండకాయతో పాటు మిగతా కూరగాయల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

–యేసప్ప, రైతు, కృష్ణపూర్

ఓట్ల చోరీని నిరసిస్తూ సంతకాల సేకరణ

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కేంద్రంలోని బీజేపీ సర్కారు చేస్తున్న ఓట్ల చోరీని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో వంద మంది చొప్పున సంతకాలు చేయించాలన్నారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లోని ప్రతి వార్డుల్లో వంద మంది చొప్పున ఈ సంతకాల సేకరణ జరగాలని అన్నారు. తద్వారా బీజేపీ సర్కారు చేస్తున్న ఓట్ల చోరీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈనెల 12 తేదీ వరకు ఈ సంతకాల సేకరణ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ నేత చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, పార్టీ పట్టణ ప్రెసిడెంట్ జార్జి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకన్నకు పీహెచ్‌డీ



పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి రుద్రారంలో ఉన్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వెంకన్న డాక్టరేట్‌కు అర్హత సాధించారు. సంభావ్య చికిత్స ఏజెంట్లుగా నూతన ట్రయాజోల్, ఆక్సాడియాజోల్ హెటిరోసైక్లిక్ ఉత్పన్నాల రూపకల్పన తదితర వాటిపై అధ్యయనం చేసి వ్యాసం సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ తెలిపారు. వెంకన్న పీహెచ్‌డీకి అర్హత సాధించడంపై గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

హిట్ అండ్ రన్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న సాయిలు

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శ్రామిక్ భవనంలో ట్రాన్స్‌పోర్టు వర్కర్స్(డ్రైవర్)లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిట్ అండ్ రన్ విధానం డ్రైవర్ల పట్ల శాపంగా మారిందన్నారు. చట్టం పేరుతో డ్రైవర్లకు జరిమాన, జైలు శిక్ష విధించడం అమానుషమన్నారు. కొత్తగా తీసుకొచ్చిన ట్రాన్స్‌పోర్టు చట్టాన్ని రద్దు చేయాలని, డ్రైవర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు మహిపాల్, అబ్రహం, శేఖర్, ధనరాజ్, సంజీవ్, మోహన్ పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో అందించాలి



డాక్టర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

రామాయంపేట(మెదక్): సకాలంలో వేతనాలు అందడం లేదని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది వాపోయారు. సోమవారం వారు సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. గత నెల వేతనాలు ఇంతవరకు తమకు అందలేదని, దీంతో దసరా పండుగ జరుపుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సిబ్బందికి వేతనాలు అందకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని బాలమణి హెచ్చరించారు.

ఒకరికి గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... వెల్దుర్తి గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి బైక్‌పై తూప్రాన్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామశివారు గంగమ్మగుడి సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న బైక్‌ను రాంగ్‌రూట్లో వెళ్లి ఢీకొట్టి బీటీ రోడ్డుపై పడిపోయాడు. దీంతో ముఖానికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని పోలీసులు వెల్దుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి.


చెట్లు నరికిన పరిశ్రమకు జరిమాన



కేబుల్ పరిశ్రమ నిర్వాహకులు నరికేసిన చెట్లు

చేగుంట(తూప్రాన్): చెట్లను నరికిన పరిశ్రమ యాజమాన్యానికి జరిమాన విధించినట్లు తూప్రాన్ అటవీ రేంజ్ ఆఫీసర్ అంబర్‌సింగ్ తెలిపారు. ఓ కేబుల్ పరిశ్రమ నిర్వాహకులు మండలంలోని చిన్న శివునూర్ శివారు నుంచి జాతీయ రహదారి వరకు 30 చెట్లను నరికివేశారు. దీంతో చిన్నశివునూర్ గ్రామస్తులు జిల్లా ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో జేసీబీని స్వాధీనం చేసుకొని పరిశ్రమకు రూ.60 వేల జరిమాన విధించినట్లు అటవీ అధికారి పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

హవేళిఘణాపూర్(మెదక్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేశ్ కథనం ప్రకారం... మండల పరిధిలోని గంగాపూర్ అటవీ ప్రాంతంలో నుంచి రాత్రి వేళల్లో అదే గ్రామానికి చెందిన భాస్కర్, శ్రీనివాస్‌లకు చెందిన ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పత్తి రైతు దిగాలు!

తగ్గిన దిగుబడితో అప్పులెట్లా తీర్చాలని ఆవేదన

- పత్తి పంటకు వానగండం
- సీసీఐ ధర క్వింటాల్‌కు రూ.8,110



వర్షం నీటిలో పత్తి పంట

2025-2026లో సీసీఐ ధరలు

తేమ శాతం	క్వింటాల్ ధర
8	రూ.8,110
9	రూ.8,028
10	రూ.7,947
11	రూ.7,866
12	రూ.7,785

మునిపల్లి(అందోల్): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలు వర్షార్పణం అవుతున్నాయి. జిల్లాలో వేసిన పత్తి పంటకు సుమారు రెండు నెలల పాటు వానగండం పట్టుకుంది. ఈ నేపథ్యంలో పత్తి తీసే సమయం రానే వచ్చింది. వర్షం పడుతుండటంతో పత్తి మొక్కల నుంచి కింద పడిపోయి పనికి రాకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సింగూర్ ప్రాజెక్టు ఎగువన సాగు చేసిన పత్తి, సోయా, పెసర, మినుము, చెఱకు పంటలతో పాటు తదితర పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలైన మనూర్ మండలం, బోరించా, హుక్రానతో పాటు రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి, జంబ్గి, రామోజిపల్లి, హస్నాబాద్‌తోపాటు ఆయా మండలాల్లో పంటలు నీట మునిగినట్లు రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో పత్తి పంట దిగుబడి కోసం చేసిన అప్పులు ఎట్లా తీర్చాలనే భయం రైతులను వెంటాడుతోంది. ఉన్న కాస్త పత్తి తీద్దామన్నా వర్షం



సింగూర్ ప్రాజెక్టు ఎగువన హుక్రాన గ్రామ శివారులో నీట మునిగిన పంటలను చూపిస్తున్న రైతులు

పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం మంజూరు చేసి ఆదుకుంటేనే కొంతలో కొంత వరకు అప్పులు తీర్చగలమని అన్నదాతలు పేర్కొంటున్నారు. పత్తి పంటకు ప్రభుత్వం ధర రూ.8,110 నిర్ణయించడంతో విచారం వ్యక్తం చేస్తున్నారు. అసలే పత్తి లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ధర కూడా లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు.

పత్తి పంటకు సీసీఐ నిబంధనలు

అంతే కాకుండా పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్‌కు, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ ఉండాలని సీసీఐ నిబంధనలు పెట్టింది.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం ఆదుకోవాలి. దెబ్బ తిన్న పంటలను పరిశీలించి నష్టపరిహారం మంజూరు చేయాలి. కొంతలో కొంత వరకు అప్పులు కట్టుకునే అవకాశం ఉంటుంది.
– ఇస్మాయిల్, రైతు

నమోదు చేస్తున్నాం..



ప్రభుత్వం, సంబంధిత అధికారుల నిర్ణయం ప్రకారం పని చేస్తున్నాం. పంట నష్టపోయిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాం.
– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని తొలగిస్తుండగా..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వివేక్ కిరణ్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం... పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన పోతిరెడ్డి యాదవరెడ్డి, అంజలి దంపతుల కుమారుడు వివేక్ కిరణ్‌రెడ్డి (22) హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవలే ఐఐటీ పూర్తి చేసి మూడు నెలల క్రితం సిద్దిపేటకు వచ్చాడు. ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. అయితే రోజు మాదిరిగానే అతడు హౌసింగ్‌బోర్డు కాలనీలోని జిమ్‌కు సోమవారం ఉదయం వెళ్లాడు. ఈ క్రమంలో స్నేహితుడితో కలిసి అతడు కిందకు వస్తుండగా భవనం రెండవ అంతస్తులో ఉన్న ఓ రెస్టారెంట్‌కు సంబంధించిన ఫ్లెక్సీ దారికి అడ్డుగా పడింది. గమనించిన వివేక్ ఫ్లెక్సీని తీసి పక్కకు వేస్తున్న క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

మెట్లు పైనుంచి పడి..

జిన్నారం (పటాన్‌చెరు : మెట్లు ఎక్కుతూ కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బొల్లారం పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దశరథ్ వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిన్న (51) కొంతకాలంగా బొల్లారం పట్టణ పరిధిలోని పోచమ్మ బస్తీలో నివాసముంటున్నాడు. గత నెల 21న తను నివాసముండేపై అంతస్తుకు మంచినీటి డబ్బాతో మెట్లు ఎక్కుతున్న క్రమంలో కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలు కాగా నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ.వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిడ్‌మోడి గ్రామానికి చెందిన బాలాజీ(41) ఈ నెల 3న రాత్రి బైపాస్ రోడ్డులో గల అల్గోల్ చౌరస్తా నుంచి పట్టణంలోకి కాలినడకన వెళుతున్నాడు. అల్బా కంపెనీ వద్ద ఎదురుగా వస్తున్న టీఎస్15 ఈఏ5135 నంబర్ గల కారు బాలాజీని ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా కారు డ్రైవర్ గౌతంరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దశదినకర్మకు వెళ్లి స్నానం చేస్తుండగా..

జిన్నారం (పటాన్‌చెరు): నీట మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీకాంత్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణ కేంద్రానికి చెందిన తుడుము భాగయ్య (40) ఆదివారం మధ్యాహ్నం చిన్నాన్న దశదినకర్మ కావడంతో తలనీలాలు తీయించుకొని స్థానిక కుంట వైపు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం సాయంత్రం అదే కుంటలో శవమైతేలాడు. మృతుని సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

మద్దూరు(హుస్నాబాద్): ఆలయంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా... మండలంలోని లద్నూరు గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.30వేల నగదు దోచుకెళ్లారు. పరిసరాల్లో మద్యం తాగి ఆలయంలోకి ప్రవేశించినట్లు అక్కడ లభ్యమైన ఖాళీ సీసాల ద్వారా తెలుస్తుంది. ఆలయ అర్చకుడు దూసకంటి వేణుశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు ఆలయాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లో..

చేర్యాల(సిద్దిపేట): ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు తరిగొప్పుల నర్సింహులు వివరాల ప్రకారం... ఈ నెల 4న కుటుంబసభ్యులతో సహా హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారు నెక్లెస్, అరతులం ఉంగరం, 25 తులాల వెండి గొలుసులు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు.

నర్సాపూర్‌లో బైక్..

నర్సాపూర్ రూరల్: పార్కు చేసిన బైకును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని జగ్య తండాకు చెందిన శ్రీనివాస్ ఈనెల 5న సాయంత్రం 6 గంటల సమయంలో తన బైకును వైన్స్ ఎదుట పార్క్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి పిట్లం వైపు బొలెరో వాహనంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో అల్లాదుర్గం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించి, కేసు నమోదు చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రైతుల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్ ఆవరణలో రైతులు

నర్సాపూర్ రూరల్: ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులు గజ్వేల్‌లో సోమవారం ధర్నాకు పిలుపునిచ్చారు. నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి ,చిన్నచింతకుంట గ్రామాల రైతులు ధర్నాకు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధర్నాకు పిలుపునిచ్చిన విషయం తమకు తెలియదన్నారు. పోలీసులు మాత్రం అరెస్ట్‌చేసి సుమారు మూడుగంటలపాటు స్టేషన్‌లో ఉంచారని పేర్కొన్నారు.

విద్యార్థినిని ఢీకొట్టిన బైక్

కొండపాక(గజ్వేల్): విద్యార్థినిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన మల్లం మేఘన(14) స్థానిక హైస్కూలులో 8వ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగా సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లింది. ప్రభుత్వం నుంచి స్కాలర్ షిప్ పొందేందుకు దరఖాస్తు చేసుకునే క్రమంలో కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కావాలని ఉపాధ్యాయులు చెప్పారు. దీంతో ఇంటి వద్ద ఉందంటూ మరో ఇద్దరు విద్యార్థినులతో కలిసి వెళ్లింది. తిరిగి పాఠశాలకు వస్తున్న క్రమంలో రాజీవ్ రహదారి దాటుతోంది. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యార్థినిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై ఎగిరి పడటంతో తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఆర్వీఎం ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రౌడీ షీటర్ దారుణహత్య

బండరాయితో బాది హత్య చేసిన సహచరులు



యాదగిరి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ వెంకటరాజంగౌడ్, ఎస్ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): రౌడీ షీటర్‌ను దారుణంగా హత్యచేశారు. ఈ ఘటన మండలంలోని శాలిపేట గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. తూప్రాన్ డీఎస్పీ కథనం మేరకు... గ్రామానికి చెందిన ఉప్పరి యాదగిరి(45)కి నేర చరిత్ర ఉంది. అతడిపై హత్యాయత్నంతోపాటు పలు కేసులు ఉన్నాయి. ఒంటరిగా జీవిస్తున్న అతడికి పాలివారితో కూడా గొడవలు ఉన్నాయి. మరోవైపు పాలివారైన ఉప్పరి రాములు, శ్యామ్, ఎల్లం వారం రోజుల క్రితం గొర్రెలను దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసు విచారణలో ఉండగానే దసరా వచ్చిందని, గ్రామస్తుల జామీనుపై నిందితులు ముగ్గురిని సొంత గ్రామానికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం యాదగిరితో కలిసి ముగ్గురు మద్యం తాగారు. తమను నేరాలకు ప్రేరేపిస్తూ తమతో దొంగతనాలు చేయిస్తూ తమకు చెడ్డ పేరు వచ్చేందుకు కారణం నువ్వేనంటూ ఆగ్రహంతో యాదగిరిని బండరాయితో దాడిచేసి హత్య చేశారు. వెంటనే నిందితులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ బృందంతో ఆధారాలు సేకరించారు. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ ఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికెన్ సెంటర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ

ఒకరి మృతి



దాడిలో మరణించిన శేరి మహబూబ్

పాపన్నపేట(మెదక్): చికెన్ దుకాణం నిర్వాహకుల మధ్య తలెత్తిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని ఏడుపాయలలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం... నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన శేరి మహబూబ్ (35) పంక్చర్ దుకాణం నడుపుతున్నాడు. అతని సోదరి సుల్తాన ఏడుపాయల్లో చికెన్ సెంటర్ నిర్వహిస్తుంది. ఆమె దుకాణం పక్కన నాగ్సాన్‌పల్లికి చెందిన చాకలి విఠల్ సైతం చికెన్ షాపు నడుపుతున్నాడు. అయితే వీరిద్దరి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుల్తాన, మహబూబ్ భార్య రేష్మా దుకాణంలో ఉండగా, పక్క షాపునకు చెందిన చాకలి విఠల్, రాజమణి, యాదగిరి, మహేశ్ వారితో ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న మహబూబ్ అక్కడకు వచ్చాడు. చాకలి విఠల్ కుటుంబీకులు జరిపిన దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు.

పెట్రోల్‌లో నీటి కలకలం

వాహనదారుడి ఆందోళన



పెట్రోల్‌లో నీరు కలిసిందని బాటిల్‌ను చూపుతున్న వాహనదారుడు

దుబ్బాకటౌన్: ద్విచక్రవాహనంలో పోయించుకున్న పెట్రోల్‌లో నీరు కలిసిందంటూ వాహనదారుడు ఆందోళన చేశాడు. ఈ ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటకు చెందిన బాబు గొర్రెల వ్యాపారి. పట్టణంలోని టీజీఎస్ ఆర్టీసీ లోకల్ పెట్రోల్ బంక్‌లో సోమవారం రూ.190 విలువ గల పెట్రోల్‌ను ద్విచక్రవాహనంలో పోయించుకున్నాడు. అక్కడి నుంచి రాజక్కపేటకు వెళ్లే సరికి వాహనం ఆగిపోయి, తిరిగి స్టార్ట్ కాలేదు. దీంతో ద్విచక్రవాహనాన్ని ఆటోలో బంక్‌కు తీసుకొచ్చాడు. అనంతరం వాహనంలోని పెట్రోల్ ట్యాంక్ నుంచి పెట్రోల్‌ని మూడు ప్లాస్టిక్ బాటిళ్లలోకి తీశాడు. పైన పెట్రోల్, కింద నీరు ఉన్నట్లు బంక్ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చాడు. నీరు కలిసే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ లేదని వారు చెప్పారు. దీంతో తనకు న్యాయం చేసి, బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వాహనదారుడు అధికారులను డిమాండ్ చేశాడు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన బొలెరో

- విద్యార్థులకు స్వల్పగాయాలు
- తప్పిన పెను ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): స్కూల్ బస్సును బొలెరో వాహనం ఢీకొట్టగా పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కాళ్లకల్ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు మేడ్చల్‌లోని సైబరేజ్ స్కూల్‌లో చదువుతున్నారు. సోమవారం స్కూల్ ముగిసిన తర్వాత విద్యార్థులతో బస్సు బయలుదేరింది. కాళ్లకల్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో మేడ్చల్ వైపు వెళుతున్న బొలెరో వేగంగా వచ్చి అదుపుతప్పి స్కూల్ బస్సును ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సులో ఉన్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. కాగా పెద్దగా ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వాహనాలు పక్కకు తీసి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధి సితారం తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... తండాకు చెందిన కాత్రోత్ తరుణ్(30) నాలుగు రోజుల క్రితం భార్య శాంతతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పీఎస్‌లో ఫిర్యాదు చేసి ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన తరుణ్ సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం



రోజు వారి వర్కర్లతో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న రోజువారి , పార్ట్ టైం వర్కర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని సమ్మె చేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మల్లేశం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్కర్లకు గత 30 ఏళ్లుగా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక శాఖ విడుదల చేసిన జీఓ నం.64 ప్రకారం వేతనాలు చెల్లించాలని మౌఖిక ఆదేశాలిచ్చారన్నారు. దీని ఫలితంగా వేతనాలు బాగా తగ్గుతున్నట్లు ఆరోపించారు. ఈ జీవోను రద్దుచేసి యథావిధిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

టేకు మొక్క నాటేదెప్పుడు?

ఎనిమిదేళ్లుగా నిలిచిన సరఫరా

- వనమహోత్సవంలోనూ కనిపించని వైనం
- డిమాండ్ ఉన్నా అందించని యంత్రాంగం
- ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతున్న రైతులు

కోహెడరూరల్(హుస్నాబాద్): అడవుల విస్తీర్ణం పెంచాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టింది. ఏటా వర్షాకాలంలో పలు రకాల మొక్కలు నాటేలా చర్యలు కూడా చేపట్టింది. అలాగే అన్నదాతలకు ఆర్థికంగా అదనపు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో లాభదాయకమైన టేకు మొక్కలు నాటే దిశగా ప్రోత్సహించింది. మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు వాటిని పొలం గట్లపై, బీడు భూముల్లో నాటించడం, సంరక్షణకు సైతం ఆర్థిక చేయూతనందించేది. అయితే ఈ మొక్కల జాడ కానరావడం లేదు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన వనమహోత్సవంలోనూ ఈ మొక్కలు పూర్తిగా మాయమయ్యాయి. రైతుల నుంచి డిమాండ్ ఉన్న యంత్రాంగం వాటిని అందించడం లేదనే విమర్శలున్నాయి.



మొక్కలు నాటేందుకు తీసిన గుంతలు



గతంలో నాటిన టేకు మొక్కలు

నిలిచిన సరఫరా

హరితహారంలో భాగంగా గతంలో ఏటా వానాకాలంలో మొక్కలు నాటేవారు. నీడనిచ్చే వేప, రావి, మర్రితో పాటు పూలు, పండ్ల మొక్కలను ప్రభుత్వం అందించేది. వీటితోపాటు రైతుల తమ పొలాల గట్లపై నాటుకునేందుకు వీలుగా టేకు మొక్కలనూ ఉచితంగా ఇచ్చేవారు. అయితే నాలుగేళ్లుగా వీటి పంపిణీ నిలిపివేశారు. అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే నర్సరీలో ఈ మొక్కలు పెంపకం చేపట్టడం లేదు.

రైతులకు లబ్ధి..

గతంలో చిన్న, సన్నకారు రైతులకు ఎకరా చొప్పున టేకు మొక్కలు పంపిణీ చేశారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను డిమాండ్ మేరకు ప్రభుత్వం ఉచితంగా అందించేది. అలాగే వాటిని పొలం గట్లపై, బీడు భూముల్లో నాటేందుకు ఉపాధి కూలీలతో గుంతలు తీయించేవారు. వాటి సంరక్షణకు సైతం ఈజీఎస్ ద్వారా చేయూత అందించేది. ఒక్కో మొక్కకు నెలకు రూ.5 చొప్పున చెల్లించింది. రెండేళ్ల పాటు ఈ ఆర్థిక సహాయం కొనసాగింది. ఇలా అవి వృక్షాలుగా ఎదిగేందుకు అన్నదాతలకు తోడ్పాటునిచ్చింది.

డిమాండ్ ఉన్నా ..

జిల్లాలో టేకు మొక్కలకు డిమాండ్ ఉన్నా యంత్రాంగం వాటిని అందించడం లేదు. గత హరితహారంలోనూ అందించక పోగా ఈ ఏడాది అమలు చేసిన వన మహోత్సవంలో కూడా ఇవ్వలేదు. దీనిపై ఆసక్తి గల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే మొక్కలతోపాటు ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు.

పంపిణీ లేదు

గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ టేకు మొక్కల పంపిణీ లేదు. రైతుల నుంచి డిమాండ్ ఉంది. కానీ, ప్రభుత్వం మొక్కల పంపిణీపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇతర మొక్కలు పంపిణీ చేస్తుంది
– ఏపీఓ రంగనాయక్, ఏపీఓ, కోహెడ